VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...


TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 01 జూలై 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:03 సంచిక: 388

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



తెలంగాణలో మరోమారు సర్ గడువు పొడిగింపు



## వందేమాతరాన్ని అవమానిస్తే మూడేళ్ల జైలు శిక్ష

**జాతీయ గేయం వందేమాతరంను అవమానిం చడం, ఆలాపనకు ఆటంకం కలిగించడం లేదా అడ్డుకోవడాన్ని నేరంగా పరిగణించే దేశ గౌరవానికి అవమానాలను నిరోధించే (సవరణ) బిల్లు--2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపింది.**

న్యూఢిల్లీ, జూలై 31 రా జ్యసభలో ఇప్పటికే ఆమోదం పొందిన ఈ బిల్లును గురువారం లోక్స భ కూడా ఆమోదించింది. దీంతో రాష్ట్ర పతి ఆమోదం అనంతరం ఇది చట్టంగా అమ ల్లోకి రానుంది. ఈ చట్టం ప్రకారం వందేమా తరం గేయాన్ని ఉద్దేశపూర్వ కంగా అవ మానించినా, ఆలాపన సమయంలో ఆటంకం కలిగించినా లేదా అడ్డుకున్నా మూడేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. లోక్సభలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అం శంపై ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్య ఈ బిల్లును మూజువాణీ ఓటుతో ఆమోదించారు.



# టామ్‌కాం ద్వారా ఉపాధి.. పాస్‌పోర్టు సేవలు

**విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్లే యువతకు శిక్షణ, పాస్‌పోర్టు, ఉద్యోగ మేళాలు, విదేశీ ఉపాధి అవకాశాల కల్పన వరకు అన్ని బాధ్యతలను తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ (టామ్‌కాం) చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం శక్తి శాఖపై మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక నిర్ణయాలు వెల్లడించారు.**

## విదేశీ ఉద్యోగాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**విదేశీ భాషలు, డ్రైవింగ్ శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం**

**ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య విశ్వవిద్యాలయంపై సీఎం సమీక్ష**

**విద్యుత్ వాహనాలు, డ్రోన్ కోర్సులు ప్రవేశపెట్టాలని సూచన**

హైదరాబాద్, జూలై 31: విదేశాల్లో ఉద్యోగులకు సమస్యలు ఎదురైనా ప్రభుత్వం తరఫున చర్చించి న్యాయం చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. విదేశాలకు కార్మికులను పంపించే ఏజెంట్ల వివరాలతో పాటు వారు పంపించే ప్రతి వ్యక్తి సమాచారాన్ని నమోదు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ వ్యవహారాల పర్యవేక్షణ కోసం (మిగతా 2వ పేజీలో)

# నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం

## 17,900 కోట్ల పనులకు శ్రీకారం




-3లో

## వడ్డెరలు "ఐక్యంగా పోరాడితేనే" హక్కులు సాధ్యం.

**జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఫీట్ల శ్రీధర్. వడ్డెర సంఘం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సులో..**



# ఉద్యోగుల ఆరోగ్య ట్రస్ట్‌ను మరింత బలోపేతం చేయాలి

**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ (Employees Health Care Trust) పనితీరును మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.**

హైదరాబాద్, జూలై 31 శుక్రవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన తెలంగాణ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ సమావేశం జరిగింది. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు, ఆస్పత్రుల్లో అందుతున్న సేవలు, చికిత్స ప్యాకేజీ రేట్లు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, ఆరోగ్య పథకాన్ని నిరంతరం సమీక్షిస్తూ ప్రస్తుతం అమలులో ఉన్న చికిత్స ప్యాకేజీ రేట్లను సమగ్రంగా పునఃపరిశీలించి అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను (మిగతా 2వ పేజీలో)



## ఫార్ములా-ఈ కేసులో తొలిసారి కోర్టుకు హాజరైన కేటీఆర్

**ఫార్ములా-ఈ రేసు కేసులో ఛార్జ్‌షీట్ దాఖలైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు (కేటీఆర్) శుక్రవారం నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో తొలిసారిగా హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 25కు వాయిదా వేసింది.**

హైదరాబాద్, జూలై 31 ఈ కేసులో మొదటి నిందితుడు (ఏ1)గా ఉన్న కేటీఆర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, మాజీ హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్. రెడ్డి కూడా కోర్టుకు హాజరయ్యారు. కేటీఆర్ రూ.1 లక్షల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు ష్యూరిటీలను సమర్పించాలని కోర్టు (మిగతా 2వ పేజీలో)

# ఎల్లంపల్లి నిండడం కాంగ్రెస్ దూరదృష్టికి నిదర్శనం

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్, జూలై 31 శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం వరద జలాలతో పూర్తిస్థాయిలో నిండడం కాంగ్రెస్ ప్రభుత్వాల శాస్త్రీయ ప్రణాళిక, దూరదృష్టికి నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ పరిణామం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఎన్నాళ్లుగానో ప్రచారం చేస్తున్న వాదనలను పూర్తిగా తప్పుబట్టిందని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా (మిగతా 2వ పేజీలో)





# పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళి

**అంతిమయాత్రలో ఇసుకేస్తే రాలనంత జనం... భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు**

**ప్రభుత్వ లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు.. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత**

హైదరాబాద్, జూలై 31 బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి (54) శుక్రవారం తెల్లవారుజామున సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నెల 26న హనుమకొండలోని తన నివాసంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురికాగా, తొలుత రోహిణి ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టడం (పల్మనరీ ఎంబోలిజం) కారణంగా ఆయనకు గుండెపోటు వచ్చింది. వైద్యులు (మిగతా 2వ పేజీలో)





"వీధి దీపాల వెలుగు దారిని చూపితే... వెన్నెల కాంతి మనసుకు దారిని చూపుతుంది. ఒకటి మనిషి సృష్టి... మరొకటి ప్రకృతి వరం."

- ఫోటో: కుంచె వెంకటేష్. నిజామాబాద్.

వేగుచుక్క

# ఆయిల్ పామ్ విస్తరణలో అలసత్వం సహించం:

హైదరాబాద్:తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో నిర్లక్ష్యం, అలసత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో విఫలమవుతున్న ఆయిల్ పామ్ కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్‌ను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయిల్ పామ్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సెక్రటరీ కె. సురేంద్ర మోహన్, ఆయిల్ ఫెడ్ ఎండి యాస్మిన్ బాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 85 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 17,090 ఎకరాలలో మాత్రమే సాగు నమోదైందని, అంటే లక్ష్యంలో సుమారు 20 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై అత్యంత నిరాశ కలిగించే విషయమని అన్నారు. ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ కంపెనీలలో ఆశించిన స్థాయిలో చిత్తశుద్ధి కనిపించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఇప్పటికే పలుమార్లు కంపెనీలతో సమావేశాలు నిర్వహించి, ఆయిల్ పామ్ విస్తరణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, కంపెనీల పనితీరులో ఎలాంటి మార్పు కనిపించడంలేదని మంత్రి అన్నారు. రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్న సమయంలో కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. పనితీరు సరిగా లేని కంపెనీలకు ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లోహియా కంపెనీకి, గద్వాల, నారాయణపేట, జనగామ జిల్లాలలో పనిచేస్తున్న ఆయిల్ ఫెడ్‌కు నాలుగు సార్లు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా పెద్దపల్లి జిల్లాలో పనిచేస్తున్న తిరుమల కంపెనీకి, భూపాలపల్లి, ములుగు, వనపర్తి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రియూనిక్ కంపెనీకి, హనుమకొండ, వరంగల్ జిల్లాలలో పనిచేస్తున్న రామ్ చరణ్ కంపెనీకి మూడు సార్లు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గోద్రెజ్ కంపెనీకి రెండు సార్లు నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అలాగే విశ్వతేజ్ కంపెనీకి ఐదు సార్లు, కేన్ బయో కంపెనీకి ఆరు సార్లు, పతంజలి కంపెనీకి ఆరు సార్లు, మాట్రిక్స్ కంపెనీకి ఐదు సార్లు, సువేన్ ఆగ్రో కంపెనీకి మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ కంపెనీలలో ఆశించిన మార్పు కనిపించలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పతంజలి, లోహియా, కేన్ బయో, మాట్రిక్స్ కంపెనీల పరిధిలోని కొన్ని జిల్లాలను గతంలోనే తొలగించి ఇతర కంపెనీలకు అప్పగించినప్పటికీ, కంపెనీలు ఇంకా బాధ్యతాయుతమైన వైఖరి కనిపించడంలేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడిన ఏ కంపెనీ అయినా వారి పరిధిలోని జిల్లాలను
తగ్గించడానికైనా లేక పూర్తిగా తొలగించడానికైనా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడదని, అలాగే మెరుగైన పనితీరు కనబరిచే కంపెనీలకు మరికొన్ని జిల్లాలను అప్పగించే ఆలోచనకు ప్రభుత్వం సిద్ధం ఉందని అన్నారు. ప్రభుత్వ సంస్థ అయిన ఆయిల్ ఫెడ్‌కు కూడా ఎలాంటి మినహాయింపు ఉండదని, పనుల్లో పురోగతి లేకుంటే ఆ సంస్థ పరిధిలోని జిల్లాలను కూడా ఇతర సంస్థలకు లేక కొత్త సంస్థలకు అప్పగించే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో మొక్కల లభ్యతపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆగస్టు నెలలో మొక్కల కొరత ఎదురయ్యే అవకాశం ఉన్న కంపెనీలు ముందస్తుగా ఇతర కంపెనీల నుంచి మొక్కలను కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

ల్గ÷తు మొక్కలు కోరిన వెంటనే అందించే స్థాయిలో ప్రతి కంపెనీ సిద్ధంగా ఉండాలని సూచించారు. మొక్కల లభ్యత పేరుతో ఒక్క రైతు కూడా వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. కంపెనీల ఫీల్డ్ సిబ్బంది గ్రామ స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, పంట సంరక్షణ తదితర అంశాలపై రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ, వారి సందేహాలను వెంటనే నివృత్తి చేయాలని కంపెనీల ప్రతినిధులకు సూచించారు. యూనిట్ల ఏర్పాటులో జాప్యం కూడా ప్రభుత్వం సహించదని, ఇప్పటికే కావాల్సింత సమయం కంపెనీలకు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. యూనిట్లు త్వరగా అందుబాటులోకి వస్తే రైతులకు రవాణా భారం తగ్గడంతో పాటు పంటకు సకాలంలో ప్రాసెసింగ్ సౌకర్యం లభిస్తుందని పేర్కొన్నారు. అందువల్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైతులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కంపెనీలకు సూచించారు.

## రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జలకళ

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. ఆయా ప్రాజెక్టుల్లోకి వరదనీరు చేరడంతో కళకళలాడుతున్నాయి. నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి 74,950 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1069.20 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 21.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు తరలివస్తుంది . ఎగువ నుంచి 1,46,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అప్రమత్తమైన ఇంజినీరింగ్ అధికారులు 28 గేట్లను ఎత్తి దిగువకు 1,33,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం నిరంతరాయంగా కొనసాగుతోంది. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు కడెం జలాశయం గేట్లు ఎత్తడంతో పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు 15 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 1,21,354 క్యూసెక్కులు కాగా అవుట్‌ఎ÷-లో 1,08,493 క్యూసెక్కులుగా ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.45 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గోదావరి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది.

# ఎల్లంపల్లి నిండడం కాంగ్రెస్ దూరదృష్టికి నిదర్శనం

(మొదటి పేజీ తరువాయి)

సెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారీ వరద ప్రవాహాల కారణంగా శ్రీపాద ఎల్లంపల్లి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుందని తెలిపారు. అవసరమైతే మిడ్ మానేరు, లోయర్ మానేరు వంటి దిగువ జలాశయాలకు నీటిని నియంత్రితంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్ సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును శాస్త్రీయంగా రూపకల్పన చేసిందని మంత్రి చెప్పారు. గ్రావిటీ ఆధారిత వరద కాలువ వ్యవస్థ కారణంగా ఎలాంటి మోటార్లు లేదా లిఫ్టింగ్ వ్యవస్థ అవసరం లేకుండానే వరద జలాలు సహజసిద్ధంగా జలాశయంలోకి చేరాయని వివరించారు. గతంలో చేసిన తమ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

కన్నెపల్లి పంప్ హౌస్‌లో మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన ఆందోళనను ప్రస్తావిస్తూ, ఎలాంటి పంపింగ్ లేకుండానే జలాశయం నిండిపోయిందని, దీంతో వారి వాదనలు నిరాధారమని తేలిపోయిందన్నారు. "మా వల్లే నీళ్లు వచ్చాయి" అనే వారి ప్రచారాన్ని ప్రకృతే తప్పు పట్టిందని వ్యాఖ్యానించారు.

మాజీ మంత్రి హరీశ్ రావు అవకాశం ఇస్తే నెల రోజుల్లో నీటిని ఎత్తిపోసి అందిస్తానని గతంలో ప్రకటించారని గుర్తుచేసిన మంత్రి, ఇప్పుడు ఎలాంటి ఎత్తిపోతల అవసరం లేకుండానే నీరు సహజంగా జలాశయానికి చేరిందని చెప్పారు. దీంతో గతంలో చేసిన వ్యాఖ్యలపై హరీశ్ రావు ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రతిపక్షంగా నిర్మాణాత్మక పాత్ర పోషించకుండా, కరువు రావాలని, పంటలు దెబ్బతినాలని, ప్రజలు ఇబ్బందులు పడాలని కోరుకుంటున్నట్టుగా వ్యవహరిస్తోందని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవడం, రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించడం కూడా ఆ పార్టీకి ఇబ్బందిగా కనిపించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.





## ఫార్ములా-ఈ కేసులో తొలిసారి కోర్టుకు హాజరైన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. ఫార్ములా-ఈ రేసు నిర్వహణకు సంబంధించి ఏసీబీ మార్చి 23న 77 పేజీల ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసింది. ఇందులో కేటీఆర్, అరవింద్ కుమార్, బి.ఎల్.ఎన్. రెడ్డి, ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఖీజుూ) సంస్థలను నిందితులుగా పేర్కొంది. కేసులో 14 మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలిపింది.

తప్పనిసరిగా పొందాల్సిన ఆర్థిక శాఖ, న్యాయ శాఖ అనుమతులు, అలాగే మంత్రివర్గ ఆమోదం లేకుండానే ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థకు నిధులు విడుదల చేసినట్లు ఏసీబీ ఆరోపించింది. దీనివల్ల హెచ్‌ఎండీఏకు రూ.54.88 కోట్ల నష్టం వాటిల్లిందని, కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా రాష్ట్ర ఖజానాపై సుమారు రూ.600 కోట్ల మేర ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది.

అలాగే ప్రైవేటు సంస్థ ఏస్ నెక్ట్స్‌జెన్‌కు అనుచిత ప్రయోజనాలు కల్పించడంతో పాటు ప్రతిఫల ఒప్పందం (క్విడ్ ప్రో కో) జరిగినట్లు ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను నిందితులంతా ఖండించారు.

కేటీఆర్‌కు మద్దతుగా మాజీ మంత్రులు పి. సబితా ఇంద్రారెడ్డి, మహ్మద్ మహమూద్ అలీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తదితర బీఆర్ఎస్ నేతలు కోర్టుకు హాజరయ్యారు.

## హైడ్రాపై వెనక్కి తగ్గేదేలే

### సీఎం రేవంత్ స్పష్టం

హైదరాబాద్, జూలై 31 హైడ్రా (న్‌ణ=ూూా)పై తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వ్యవహారంపై స్పందించిన ఆయన, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, కాలువలను ఆక్రమణల నుంచి రక్షించే చర్యలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు.

ఆక్రమణదారులు చట్టపరమైన పోరాటం పేరుతో ప్రభుత్వ చర్యలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు. అయితే చట్టాన్ని గౌరవిస్తూ, న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగానే ప్రభుత్వం ముందుకు సాగుతుందని చెప్పారు. హైడ్రా లక్ష్యం ప్రజా ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల సంరక్షణ మాత్రమేనని, ఇందులో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు.

హైడ్రా చేపడుతున్న చర్యలను కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించిన ముఖ్యమంత్రి, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఆ దిశగా హైడ్రా చర్యలు నిరంతరం కొనసాగుతాయని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళి

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 45 నిమిషాలపాటు సీపీఆర్ నిర్వహించి గుండె స్పందనను పునరుద్ధరించినప్పటికీ, మెదడు స్పందన లేకపోవడంతో పరిస్థితి విషమించింది. ఆరు రోజుల పాటు వైద్య బృందం చేసిన తీవ్ర ప్రయత్నాలు ఫలించక ఆయన తుదిశ్వాస విడిచారు.

పెద్ది సుదర్శన్ రెడ్డి 1974 ఆగస్టు 6న వరంగల్ రూరల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నల్లబెల్లి గ్రామంలో రాజిరెడ్డి, అమృతమ్మ దంపతులకు జన్మించారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన 1991లో వరంగల్‌లోని మహబూబియా పంజతన్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. ఆయన భార్య స్వప్న. కుమారుడు నిధర్శన్ రెడ్డి, కుమార్తె ధర్మిష్ఠ రెడ్డి ఉన్నారు.

సుదర్శన్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువజన కాంగ్రెస్‌తో ప్రారంభమైంది. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) ఆవిర్భావ సమయంలో ఆ పార్టీలో చేరారు. నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా ఎన్నికై జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్‌గా సేవలందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ ప్రాంతంలో నిర్వహించిన సభలు, భారీ ర్యాలీల్లో చురుకుగా పాల్గొని కీలక పాత్ర పోషించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికి సన్నిహితుడిగా గుర్తింపు పొందిన ఆయన, పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను అంకితభావంతో నిర్వహించిన నాయకుడిగా పేరు సంపాదించారు.

2014 అసెంబ్లీ ఎన్నికల్లో నర్సంపేట నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన ఆయన, 2018 ఎన్నికల్లో ఘన విజయం సాధించి నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018--2023 మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్‌గా, శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా కూడా సేవలందించారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పలువురు ప్రజాప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు: కేసీఆర్

హైదరాబాద్, జూలై 31 మాజీ నర్సంపేట ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతిపై బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన రెండో దశ ఉద్యమంలో, ముఖ్యంగా వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి పనిచేసిన రోజుల్ని కేసీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు పార్టీ చేసిన ప్రయత్నాలు, వైద్యులు చేసిన శ్రమ ఫలించకపోవడం తీవ్ర బాధ కలిగించిందని పేర్కొన్నారు. నిజాయితీ, నిబద్ధతతో కూడిన రాజకీయ ప్రస్థానం సాగించిన పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. తెలంగాణనే ఊపిరిగా భావించి ప్రజల కోసం పనిచేసిన నాయకుడిగా ఆయన నిలిచిపోయారని అన్నారు. పోరాటాల గడ్డగా పేరొందిన నర్సంపేటలో బీఆర్ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి, ఉద్యమం నుంచి చివరి శ్వాస వరకు పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో పనిచేసిన ధైర్యవంతుడైన నాయకుడిగా సుదర్శన్ రెడ్డి గుర్తుండిపోతారని కేసీఆర్ తెలిపారు. ఉద్యమంలోనూ, నియోజకవర్గ అభివృద్ధిలోనూ ఆయన చెరగని ముద్ర వేశారని అన్నారు. పార్టీకి అత్యంత విధేయుడిగా సేవలందించిన పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్‌కు తీరని లోటని కేసీఆర్ పేర్కొన్నారు. పోలీసు ఒత్తిళ్లు, బెయిల్ లేని కేసులు, జైలు జీవితం వంటి ఎన్నో కష్టాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన ఆయన సేవలు పార్టీ శ్రేణులు, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా ఆయన భార్య, పిల్లలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని కేసీఆర్ హామీ ఇచ్చారు.

## నేడు ఏపీకి ప్రధాని మోదీ రాక

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తావించింది. భోగాపురం నుంచి మైసూరు వెళ్లనున్న ప్రధాని స్వామి వివేకానంద సాంస్కృతిక యువ కేంద్రం వివేక స్మారకను ప్రారంభిస్తారని ప్రధానమంత్రి కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. 48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్' : మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విమానాశ్రయం పరిసరాలను 48 గంటల పాటు 'నో ఫ్లయింగ్ జోన్'గా ప్రకటిస్తూ కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఎయిర్‌పోర్ట్, సభా వేదిక, హెలిప్యాడ్ పరిసరాల చుట్టూ ఐదు కిలోమీటర్ల పరిధిలో గురువారం రాత్రి ఎనిమిది నుంచి శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు ఇది అమల్లో ఉంటుందని చెప్పారు. డ్రోన్లు, మానవరహిత విమానాలు, పారా-గ్లైడర్స్, మైక్రో-లైట్‌ఎయిర్‌క్రాఫ్ట్‌లు తదితర వాటిపై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ దామోదర్ హెచ్చరించారు.

## టామ్‌కాం ద్వారా ఉపాధి.. పాస్‌పోర్టు సేవలు

(మొదటి పేజీ తరువాయి)

విదేశీ భాషల బోధనకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి, అవసరమైతే ఆయా దేశాలకు చెందిన శిక్షకులను నియమించాలని సూచించారు.

ఉన్నత విద్యకు అందించే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల మాదిరిగానే బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందే యువతకు కూడా స్కాలర్‌షిప్‌లు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. అలాగే యూనివర్సిటీ ప్రాంగణంలో రీలోకేటెడ్ చెట్లను నాటాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ఐటీఐలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించాలని సీఎం అన్నారు. చదువుతో పాటు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా స్టైఫండ్‌తో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా అలవడతాయని చెప్పారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) సర్వీసింగ్ వంటి అత్యాధునిక కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని, అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా నర్సింగ్ కళాశాలల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఉద్యోగుల ఆరోగ్య ట్రస్ట్‌ను మరింత బలోపేతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. ట్రస్ట్ కార్యకలాపాల సమర్థ నిర్వహణ కోసం కార్యనిర్వాహక కమిటీతో పాటు అవసరమైన ఉపకమిటీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీలు చికిత్స ప్యాకేజీ రేట్లు, ఆస్పత్రుల ఎంపిక, సేవల నాణ్యత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలను నిరంతరం సమీక్షించి ట్రస్ట్‌కు సిఫారసులు చేయనున్నాయి.

అత్యవసర పరిస్థితుల్లో చికిత్స అవసరమైన ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే వైద్య సహాయం అందేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. ఇందుకోసం 24 గంటల సహాయ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, వేగవంతమైన అనుమతి ప్రక్రియ, ఎంపానెల్ ఆస్పత్రులతో మెరుగైన సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉద్యోగుల ఆరోగ్య పథకం ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన వైద్య సేవలు అందేలా ట్రస్ట్ పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలని సంజయ్ జాజు అధికారులకు స్పష్టం చేశారు.

# పార్లమెంట్‌ను సాగనివ్వని.. లాఠీఛార్జ్, పెల్లెట్ గన్స్!



పార్లమెంట్ సజావుగా సాగడం లేదు. వారం దాటినా కార్యక్రమాలు చేపట్టలేక పోయారు. కేవలం పేపర్ లీక్ బిల్లు మాత్రం ఆమోదం పొందింది. ఇక అనేకానేక సమస్యలు ఉన్నా వాటిపై చర్చ సాగుతుందన్న నమ్మకం లేదు. ఎందుకంటే గతంలోనూ ఇలాగే సాగింది. గత పార్లమెంట్ రికార్డును పరిశీలిస్తే ఇదే కనిపిస్తుంది. విపక్షాలు కేవలం ఆందోళనలతో పార్లమెంట్‌ను స్తంభింప చేస్తున్నారు. పార్లమెంట్‌లో లాఠీ-ఛార్జ్‌పై చర్చకు పట్టుబట్టడం ద్వారా తమ మొండి వైఖరిని కనబరుస్తున్నారు. పార్లమెంట్ బయటా ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు. విద్యార్థులపై లాఠీ-ఛార్జ్, పెల్లెట్ గన్స్ వాడడంపై నిలదీస్తున్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తుండడంతో సభ సాగడం లేదు. ఇలా ఉభయసభలు రోజూ వాయిదా పడుతూనే ఉన్నాయి.

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే బలప్రయోగానికి దిగడంపై ప్రతిపక్ష పార్టీలు హక్కుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అయితే జంతర్ మంతర్ ఘటనలో పలుఉవరు పోలీసులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. కొందరి తలలు పగిలాయి. ఎందరో రక్తమోడారు. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే పోలీసులు రెండురకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటుంటారు. ఆందోళనలను అణచివేయడంతో పాటు, తమతను తాము కాపాడుకుంటూ, పై అధికారులను కాపాడాలి. ఈ సందర్భంగా వారు విధిలేని సమయంలో లాఠీఛార్జ్‌కు పాల్పడాల్సి వస్తుంది. ఇకపోతే అనేక సందర్భాల్లో అతిగా కూడా వ్యవహరించిన సంఘటనలు ఉన్నాయి. భారతీయ నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం ఎలాంటి గుంపునైనా చెదరగొట్టడానికి నోటీసులు ఇచ్చిన తర్వాతే బలప్రయోగం చేయాలి. మానవ హక్కుల కమిషన్ నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్, హెచ్చరికల తర్వాతే అత్యల్ప బలాన్ని ఉపయోగించాలి. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులను క్షేత్రస్థాయిలో పోలీసులు పూర్తిగా కాలరాస్తున్నారు. అరెస్టు సమయంలో పాటించాల్సిన చట్టబద్ధమైన పక్రియలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అరెస్టు నిబంధనలు ఎల్లప్పుడూ పాటిస్తున్నామని కేవలం 41 శాతం మంది పోలీసులు మాత్రమే అంగీకరిస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులకు కారణాలు చెప్పడం, వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి సరిగ్గా జరగడం లేదు. నిందితులు తమ న్యాయవాదిని సంప్రదించే హక్కును శాశ్వతంగా రద్దు చేయాలని 20 శాతం మంది పోలీసులు వాదిస్తున్నారు. లాఠీఛార్జీలు, హింసాత్మక సంఘటనల్లో గాయపడిన పౌరుల లెక్కల విషయంలో అధికారిక గణాంకాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి.

మానవ హక్కుల ఉల్లంఘనలు, కస్టడీ మరణాల వివరాల సేకరణలో మన డేటా వ్యవస్థ విఫల మవుతోంది. పోలీస్ వ్యవస్థలో సమూల సంస్కరణలు తేకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పౌరుల హక్కుల రక్షణతో పాటు చట్ట పాలన సక్రమంగా సాగేలా చూడటమే ప్రజాస్వా మ్యానికి శ్రీరామరక్ష. ఒత్తిళ్లకు తలొగ్గి అక్రమ మార్గాలను ఎంచుకోవడం పోలీసు వ్యవస్థకే తీవ్ర నష్టం కలిగిస్తుంది. పోలీసులు చట్టానికి లోబడి పనిచేసేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. శిక్షణ సమయంలో మానవ హక్కుల పట్ల అవగాహన పెంచడం ద్వారానే పౌర హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుంది. కానీ స్టేటస్ ఆఫ్ పోలీసింగ్ ఇన్ ఇండియా 2025 సర్వేలో వెల్లడైన నిజాలు అందరినీ దిగ్భ్రాంతికి గురిచేస్తున్నాయి. 17 రాష్ట్రాల్లోని 8,276 మంది పోలీసుల అభిప్రాయాలను సేకరించగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎక్కువ మంది తమ చర్యలపై ఎలాంటి విచారణ ఉండకూడదని భావిస్తున్నారు. ఈ సర్వేలో వెల్లడైన గణాంకాలు దేశంలో పోలీసుల అధికార దుర్వినియోగానికి అద్దం పడుతున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 70 శాతానికి పైగా పోలీసులు బాధ్యతల నిర్వహణలో బలప్రయోగం చేసినా తమపై ఎలాంటి శిక్ష పడకూడదని స్పష్టం చేస్తున్నారు. కోర్టు విచారణ లేకుండానే అనుమానితులను అరెస్టు చేసి డిటైన్ చేసే అధికారం పోలీసులకు ఉండాలని 69 శాతం మంది కోరుకుంటున్నారు. ప్రజల్లో భయం పుట్టించడానికి కఠిన పద్ధతులు ఉపయోగించడం అత్యంత అవసరమని 55 శాతం మంది పోలీసులు అభిప్రాయపడ్డారు. నిరసనకారులపై లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలు చూస్తున్నప్పుడు ప్రతీ ఒక్కరి మనసులో మెదిలే ప్రశ్న ఇది. నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించడానికి సమాజం నుంచి వస్తున్న ఒత్తిడే కారణమని పోలీసులు చెబుతున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో అమాయకులు సైతం పోలీసుల ఆగడాలకు బలవుతున్నారు. నిందితులపై తీవ్రంగా విరుచుకుపడటానికి ప్రజల ఒత్తిడే ప్రధాన కారణమని మూడింట రెండు వంతుల మంది పోలీసులు చెబుతున్నారు. . నేరాల నియంత్రణకు అసాంఘిక శక్తుల ముందస్తు అరెస్టులు చాలా ఉపయోగపడతాయని 48 శాతం మంది స్పష్టం చేశారు. నిర్బంధాల కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని 43 శాతం మంది కోరుతున్నారు. 2024 రైతు ఆందోళనలు, మణిపూర్ నిరసనల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడినా ఎన్‌సిఆర్‌బి రికార్డుల్లో కేవలం ఇద్దరేనని చూపించారు. ఈ క్రమంలో ఆందోళనల సమయంలో పోలీసుల తీరును విమర్శించే వారు, వాటిని ఎలా కంట్రోల్ చేయాలో చెప్పాల్సి ఉంది. పోలీసులకు సరైన దిశానిర్దేశం చేయాలి.

# వడ్డెరలు "ఐక్యంగా పోరాడితేనే" హక్కులు సాధ్యం.

జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఫీట్ల శ్రీధర్.

వడ్డెర సంఘం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సులో...




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

స్వాతంత్రం సిద్ధించి ఏళ్లు గడుస్తున్న వడ్డెరుల బతుకుల్లో వెలుగులు లేవని, ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలని జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షుడు ఫీట్ల శ్రీ ధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వడ్డెర కులస్థుల బతుకులు మారాలంటే ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు నిర్మించాలని అన్నారు. వడ్డెరల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సంఘటితంగా ముందుకు సాగితేనే వడ్డెరల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, హక్కుల పరిరక్షణతో పాటు సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వడ్డెర సమాజం ఐక్యతను మరింత బలోపేతం చేసి, భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఫీట్ల శ్రీధర్ సూచించారు.

**సంఘం జాతీయ సలహాదారు దండి వెంకట్, రాష్ట్ర అధ్యక్షుడు వల్లెపు శివకుమార్ మాట్లాడుతూ..**

భారతదేశ నిర్మాణం, అభివృద్ధిలో వడ్డెర కులస్థులు చారిత్రకంగా విశేష సేవలు అందించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వాలు తమకు విద్య, ఉపాధి, భూమి, గృహాలు, సంక్షేమ పథకాలు, నైపుణ్యాభివృద్ధి, స్వ యం ఉపాధి వంటి రంగాల్లో సముచిత అవకాశాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. రాజకీయ రంగంలో వడ్డెర సమా జానికి తగిన ప్రాతినిధ్యం కల్పించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. వడ్డెర యువత విద్య, ఉద్యోగాలు, స్వయం ఉపాధి, సామాజిక చైతన్య కార్యక్రమాల్లో ముందుండా లని, మహిళలు కూడా నాయకత్వ బాధ్యతలు చేపట్టాల న్నారు. గ్రామ స్థాయి నుంచి సంఘాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఆర్.నర్సింహులు, చెల్లా ఎల్లయ్య, శంకర్, ప్రధాన కార్యదర్శి భక్తుల శంకర్, నాయకులు వేముల రవి, పీట్ల శ్రీనివాస్, డి.రాజు, జి.రాజన్న పల్లపు మహేష్, రాములు పాల్గొన్నారు.

## అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

### 450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ




**న్యూయార్క్, జులై 31 :** అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా' ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసిం ది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్‌ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

## ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

### మెటాపై సైబర్ క్రైమ్ పోలీసుల కేసు.. పలువురు సోషల్ మీడియా యూజర్లపైనా కేసు




**హైదరాబాద్, జులై 31 :** భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఏఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు ఏఐ సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? ఎ÷-లాట్‌ఫామ్స్ వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ఎ÷-లాట్‌ఫామ్‌లలో ంఎ స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే పక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై, తమ వద్ద ఉన్న కంటెంట్ మోడరేషన్ విధానాలు, నిబంధనల వివరాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ ఆధారాల ప్రకారమే అన్ని ఆరోపణలను పరిశీలిస్తామని, ప్రస్తుతం ఎవరిపై నేరం రుజువు కాలేదని, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.



## విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

### లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు

**న్యూయార్క్, జులై 31 :** అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించా యి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

## అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న స్కూటీ

### ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

**విశాఖపట్నం, జులై 31 :** విశాఖ నగరంలోని లంకెలపాలెం నుంచి అగనంపూడి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. శుక్రవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి తరలించారు. మృతుడు సాయిగా గుర్తించారు. గాయపడిన బాలు అనే వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. వీరిద్దరూ అగనంపూడి గల్లవానిపాలెం ప్రాంతానికి చెందినవారుగా పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై దువ్వాడ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాయి మృతితో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.







## 80 రోజుల షూటింగ్..
# 250 రోజుల్లో రిలీజ్

సూపర్‌స్టార్ మహేశ్ బాబు - రాజమౌళి వారణాసి సినిమా విడుదలపై కొత్త కొత్త ప్రచారాలు తెరపైకి వస్తున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న సినిమా థియేటర్లో విడుదలవుతుందని మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. అయితే అనుకున్న సమయానికి సినిమా రాదని, వాయిదా పడుతుందని సోషల్ మీడియాలో వందతులు వచ్చాయి. వీటన్నింటికీ వారణాసి మూవీటీమ్ చెక్ పెడుతూ శుక్రవారం ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో మహేశ్ ఫ్యాన్స్‌లో కొత్త ఉత్సాహం వచ్చింది. ముందుగా చెప్పిన ప్రకారమే సినిమా ఏప్రిల్ 7న విడుదల ఉంటుందని స్పష్టం చేస్తూ వారణాసి టీమ్ ఇవాళ కౌంట్‌డౌన్ షురూ చేసింది. ఈ చిత్రం విడుదలకు శుక్రవారం నుంచి సరిగ్గా 250 రోజులు ఉందని సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. 'వారణాసి రిలీజ్‌కు ఇంకా 250 రోజులు. 2027 ఏప్రిల్ 7' అని పోస్టు చేసింది. కాగా, ఈ సినిమాకు సంబంధించిన 80 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలివుంది. మేజర్ ఐమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌కి సంబంధించిన షూటింగ్ ఇటీవలే పూర్తయింది. హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఈ సన్నివేశాలను రాజమౌళి తెరకెక్కిస్తున్నారు.

## కార్తీ 'సర్దార్ 2' టీజర్..
# నెక్ట్స్ లెవెల్!

కోలీవుడ్ హీరో కార్తీ కెరీర్‌లో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' (2022) చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'సర్దార్ 2' టీజర్ విడుదలైంది. యాక్షన్ ప్రియులను ఉర్రూతలూగించేలా ఉన్న ఈ టీజర్‌తో పాటు, సినిమా విడుదల తేదీని కూడా మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపారు. టీజర్‌ను బట్టి చూస్తే, ఈసారి అంతర్జాతీయ కుట్రలను ఛేదించే సీక్రెట్ ఏజెంట్‌గా కార్తీ మరింత పవర్‌ఫుల్ పాత్రలో



కనిపించనున్నారు. మొదటి భాగంలో లాగే ఇందులో కూడా తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. హాలీవుడ్ చిత్రాలను తలపించేలా హై-స్పీడ్ ఛేజ్ సీక్వెన్సులు, భారీ యాక్షన్ బ్లాక్స్‌తో టీజర్‌ను తీర్చిదిద్దారు. దీంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. 'సర్దార్' మొదటి భాగానికి దర్శకత్వం వహించిన పీఎస్ మిత్రన్ ఈ సీక్వెల్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. కార్తీ సరసన మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, రాశీ ఖన్నా, రాజీషా విజయన్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మొదటి భాగానికి అద్భుతమైన నేపథ్య సంగీతం అందించిన శామ్ సీఎస్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్ కుమార్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో, ఉన్నత సాంకేతిక విలువలతో నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో ఏకకాలంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. టీజర్ విడుదల తర్వాత 'సర్దార్' మొదటి భాగాన్ని మించి ఈ సీక్వెల్ బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# రెండో పెళ్లి ఆలోచన లేదు: సురేఖావాణి

టాలీవుడ్ నటి సురేఖావాణి ఒకప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఎంతోమంది స్టార్ హీరోలతో నటించి ఫుల్ ఫేమ్ రాబట్టుకున్నారు. అయినప్పటికీ గత కొద్ది కాలంగా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె తమిళ చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ప్రస్తుతం సురేఖావాణి నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'నిరమ్'. దర్శకుడు కృష్ణ బలరామ్ తెరకెక్కిస్తున్న ఈ మూవీలో తాన్యా హోప్, ప్రీతి అస్రాని, సురేష్ చక్రవర్తి, శ్రీజిత్ రవి, తిరునావుక్కరసు గజరాజ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కెస్వేర్ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో సురేఖావాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న పుకార్లు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆమె క్లారిటీ ఇచ్చారు. రెండో పెళ్లి గురించి అడగ్గా.. తనకు ఎలాంటి రెండో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని, ఒకవేళ ఆ ఆలోచనే ఉంటే ఇప్పటివరకు ఆగాల్సిన అవసరం ఉండేది కాదని సురేఖావాణి స్పష్టం చేశారు.





## క్యాన్సర్ రోగులకు
# వివేక్ ఒబెరాయ్ భారీ విరాళం

బాలీవుడ్ నుంచి రాబోతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'రామాయణ'. ఈ ప్రిస్టీజియస్ ప్రాజెక్టును అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తుండగా.. ఇందులోని పాత్రలకు సైతం భారీ రెమ్యునరేషన్ అందుతున్నట్లు తెలుస్తుంది. అలాంటి భారీ మొత్తంలో వచ్చే రెమ్యునరేషన్ సైతం తనకు వద్దు అని చెప్పాడట బాలీవుడ్ నటుడు వివేక్ ఒబరాయ్. 'రామాయణ'లో వివేక్ ఒబరాయ్ విభీషణుడి పాత్రలో నటిస్తున్నాడు. అయితే.. ఈ సినిమా కోసం తీసుకోవాల్సిన రెమ్యూనరేషన్‌ను పూర్తిగా క్యాన్సర్‌తో పోరాడుతున్న పిల్లల ట్రీట్‌మెంట్ కోసం విరాళంగా ఇవ్వాలని ఫిక్స్ అయ్యాడట. అంతే కాకుండా ఈ విషయాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రాకు ముందుగానే తెలిపినట్లు వివేక్ వెల్లడించారు. ప్రస్తుతం ఆయన కామెంట్స్ వైరల్ కావడంతో నెట్టింట ప్రశంసలు కురిపిస్తున్నారు నెటిజన్లు. అలాగే.. రామాయణంలో విభీషణుడు కేవలం రావణుడి సోదరుడు మాత్రమే కాకుండా, అధర్మం ముందు మౌనంగా నిలబడకుండా ధర్మాన్ని ఎంచుకున్న వ్యక్తి.



# నా క్యారెక్టర్ ఇంట్రెస్టింగ్

ముగెన్ రావ్, ప్రీతి అస్రాని, తాన్యా హోప్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'నిరమ్'. ఈ చిత్రాన్ని కె. స్వేర్ సినిమాస్ సమర్పణలో యూనిట్ ఆఫ్ కె స్వేర్ వెంచర్స్ బ్యానర్‌పై కె. బిందుమాధవి నిర్మిస్తున్నారు. సరికొత్త ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ దర్శకుడు బలరామ్ కృష్ణ రూపొందిస్తున్న ఈ సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా తాజాగా 'నిరమ్' సినిమా తెలుగు ట్రైలర్, ఆడియో లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తాన్యా హోప్ మాట్లాడుతూ.. 'మా నిరమ్ మూవీ టీమ్‌తో కలిసి మీ ముందుకు రావడం సంతోషంగా ఉంది. మా సినిమా త్వరలోనే రిలీజ్‌కు రెడీ అవుతోంది. మీరంతా మా సినిమా చూసి ఎంజాయ్ చేయండి. నా క్యారెక్టర్ చాలా సింపుల్‌గా ఉంటుంది. ఒక సాధారణ యువతి తనకు తెలియకుండా ఒక పెద్ద సమస్యలో చిక్కుకుపోతే ఎలా ఇబ్బంది పడుతుంది, ఆ సమస్య నుంచి ఎలా బయటపడుతుంది అనేది నా పాత్రలో చూస్తారు. ఇంట్రెస్టింగ్‌గా వెళ్లే కథలో నేనూ ఒక భాగంగా కనిపిస్తా. ఈ టీమ్‌తో వర్క్ చేయడం హ్యాపీగా అనిపించింది.



# స్పోర్ట్స్ డ్రామాతో నందమూరి తేజస్విని ఎంట్రీ?

నటుడు, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని త్వరలోనే వెండితెరకు పరిచయం కాబోతున్నారా? అంటే అవునన్న వార్త సోషల్ మీడియాలో, ఫిల్మ్‌నగర్ వర్గాల్లో హల్‌చల్ చేస్తోంది. అయితే, సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, ఒక ప్రయోగాత్మకమైన, యువతకు స్ఫూర్తినిచ్చే స్పోర్ట్స్ డ్రామా ద్వారా ఆమె ఎంట్రీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కథా చర్చలు శరవేగంగా జరుగుతున్నాయని, అన్ని అంశాలు కుదిరితే త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'అన్‌స్టాపబుల్' టాక్ షోకు క్రియేటివ్ హెడ్‌గా, పలు సినిమాలకు నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన తేజస్విని... ఇప్పుడు నేరుగా నటిగా మారనున్నారనే వార్తలతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# షూటింగ్‌లో రష్మిక గాయాలు.. 6 వారాల రెస్ట్

సినీ నటి రష్మిక మందన్నకు గాయలయ్యాయి. సినిమా షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా తుంటి భాగంలో బలమైన గాయమైనట్లు వైద్యులు గుర్తించారు. ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. ప్రస్తుతం ఆమె రవీంద్ర పుల్లె దర్శకత్వంలో వస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'లో నటిస్తున్నారు. కథానాయిక ప్రాధాన్యమున్న ఈ చిత్రంలో రష్మిక గోండు తెగకు చెందిన మహిళగా కనిపిస్తున్నారు. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న 'మైసా'కు సంబంధించి కీలక యాక్షన్ సన్నివేశాలతో పాటు, అండర్ వాటర్ సీక్వెన్స్‌ను ఇటీవల పూర్తి చేశారు. తాజాగా ఈ సినిమాలోని ఓ పాటను షూట్ చేస్తుండగా ప్రమాదం జరిగింది.

